క్లుప్తంగా

యువతకు ఆదర్శం అల్లూరి


అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేవైఎం నాయకులు

కేశంపేట: మాన్యం వీరుడు, స్వాతంత్య్ర సమర యోధుడు అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతిని మండల కేంద్రంలో బీజేవైఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు మరణించి వంద సంవత్సరాలు గడిచినా నేటికీ ఆయన స్ఫూర్తి యువతకు ఆదర్శం అని అన్నారు. యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జంగయ్య చారి, సందీప్, బాలస్వామి, కృష్ణ, పాండురంగారెడ్డి, శ్రీను, రవిచారి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు


బోనాల ఊరేగింపు

చేవెళ్ల: మండలంలోని కమ్మెట గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు యువకుల కేరింతలతో బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. మహిళలు బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని పూజలు చేశారు.

బీజేపీతోనే దేశ భద్రత, అభివృద్ధి


షాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

షాబాద్: ప్రధాని మోదీతోనే దేశభద్రత, అభివృద్ధి సాధ్యమని బీజేవైఎం స్వచ్ఛ్ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుమ్మరిగూడ, షాబాద్, కుర్వగూడ తదితర గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల మతాలకతీతంగా అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి పీఎం మోదీ పాలన సాగిస్తున్నారన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ హామీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, కిరణ్, విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ తదితరులున్నారు.

ప్రజాపాలనతోనే పేదల సంక్షేమం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి


షాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాబాద్: ప్రజాపాలనతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శులు సురేందర్ రెడ్డి, రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా షాబాద్ మండల కేంద్రంలో చల్లా మాధవరెడ్డి, హస్మత్‌పాషాలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలోనే సుపరిపాలన అందుతుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి నిరంతరంకృషి చేస్తున్నారన్నారు. చేయి గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తమ్మలి రవీందర్, రాహుల్‌గుప్తా, రామస్వామి, నర్సింలు, శికుమార్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

వంకాయ.. లాభాలు అంతంతే

మండలంలోని రైతులు అధికంగా వంకాయ సాగు చేస్తున్నారు. వందల ఎకరాల్లో వంకాయ సాగు చేసినా లాభాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగులో లాభాలు వస్తున్నా పెట్టుబడి ఖర్చులు మందులకు పోను అంతంత మాత్రంగానే మిగులుతున్నాయని పేర్కొంటున్నారు. కూరగాయల పంటలపై సరైన అవగాహన లేకపోవడంతో లాభాలు గడించలేకపోతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నారు.

- రూరల్ మండలంలో అధికంగా సాగు
- కూరగాయల పంటలపై సూచనలిచ్చే నాథులే లేరు
- క్రిమిసంహారకాలు వాడినా ఫలితం శూన్యం


ఎత్‌మార్‌పల్లి సమీపంలో వంకాయ సాగు



మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు వంకాయ సాగు అధికంగా చేస్తున్నారు. మార్చి నెల వచ్చిందంటే కూరగాయల పంటల్లో భాగంగా వంకాయ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మండలంలోని తోల్‌కట్ట, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, చాకలిగూడ, శ్రీరామ్‌నగర్, అమ్డాపూర్, బాకారం, నాగిరెడ్డిగూడ, అజీజ్‌నగర్, చిన్నమంగళారం, కనకమామిడి, ఆయా గ్రామాల్లో రైతులు వందల ఎకరాల్లో వంకాయ సాగులో నిమగ్నమయ్యారు. సాగులో లాభాలు వస్తున్నా ఖర్చులు మందులకు పోను అంతంత మాత్రంగానే మిగులుతున్నాయని పేర్కొంటున్నారు. అధికారులు కూరగాయల పంటలపై సరైన అవగాహన కల్పించి రైతులు లాభాలు పొందే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

అంతంత మాత్రమే..



మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో వంకాయ సాగు చేస్తున్నాను. ఎకరా పొలంలో దాదాపు 50 వేల వరకు ఖర్చు చేశాను. ధరలు 20–30 రూపాయలకు కిలో మార్కెట్‌లో ధర పలుకుతోంది. వంకాయలు తెంపినప్పుడు పంటకు ప్రతీ సారి మందు పిచికారీ చేయాలి. లేదంటే పురుగుల బెడద పెరుగుతోంది. వచ్చిన డబ్బులు కిరాయిలు, కూలీలకు పోను అటు మందులు కొని లాభాలు మాత్రం అంతంత మాత్రమే మిగులుతున్నాయి. – **ఉరడి వెంకటేశ్, రైతు, తోల్‌కట్ట**

సూచనలు ఇవ్వాలి..



గ్రామాల్లో రైతులు పండించే వంకాయ సాగుపై సరైన అవగాహన కల్పించాలి. ముఖ్యంగా వంకాయలు తెంపినప్పుడు మందులు వాడాల్సి వస్తుంది. కూరగాయలలో వంకాయలకు భలే డిమాండ్ ఉంటుంది. ప్రతి సంవత్సరం వంకాయ తోట వేస్తాం. అధిక లాభం రావడం లేదు, అంతంత మాత్రమే ఉంది.

–శ్రీనివాస్, రైతు, తోల్‌కట్ట

ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచితాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పీసరి మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు పీసరి సతీశ్‌రెడ్డి, పలువురు నాయకులు చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. అనంతరం వారికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హామీల పేరుతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, పటిష్ట భద్రత బీజేపీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ వాగ్దానాలు ఇవ్వడం తప్పా వాటిని అమలు చేసింది లేదన్నారు. రామ రాజ్యస్థాపన కావాలంటే మళ్లీ కేంద్రంలో మోదీ సర్కార్ రావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంలో బీజేపీ విఫలం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజు మాట్లాడుతూ.. రాముడి పేరుతో ప్రజల దృష్టిని మళ్లించి ఓట్ల కోసం రాజకీయాలు చేస్తుందన్నారు. రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో తాము కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. చల్లా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఓటుతో బీజేపీని ఓడిద్దాం, మత రాజ్యం వద్దు.. ప్రజాస్వామ్యమే హద్దు అనే పేరుతో పార్టీ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు శ్రీనునాయక్, గోపాల్, రాజు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ఉత్తీర్ణులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న శశిధర్

పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు శశిధర్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిరోజు యోగ సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగ సమితి వ్యవస్థాపకుడు, యోగా శిక్షకుడు పానుగంటి శశిధర్ అన్నారు. పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మూడునెలలుగా ఆన్‌లైన్ యోగా తరగతులపై శిక్షణ ఇచ్చారు. పతంజలి యోగ పీఠం ద్వారా నిర్వహించిన ఆన్‌లైన్ యోగా పరీక్షల్లో పట్టణానికి చెందిన నరేందర్‌రావు, సూరం రామయ్య ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా శశిధర్ మంగళవారం భారత ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్‌మెంట్ ద్వారా గుర్తింపు పొందిన యోగా బోర్డు ధ్రువీకరణ పత్రాలు ఉత్తీర్ణులైన వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యోగ సాధన ప్రాచీన కాలం నుంచి వస్తుందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగ సాధన చేయాలని కోరారు. మనం చేసే యోగాసనాలు రోగాల నుంచి రక్షిస్తాయన్నారు. యోగ సాధనతో మేధోశక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. యోగ సాధనపై ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ఉరుములు మెరుపులతో వర్షం


మొయినాబాద్‌లో కురుస్తున్న వర్షం


షాద్‌నగర్‌లో వడగళ్ల వర్షం

వేడి నుంచి కాస్త ఉపశమనం

చేవెళ్ల: మండుతున్న ఎండలు వేడిని తట్టుకోలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలను వాన దేవుడు కరుణించాడు. మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు మొదలై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల వనగండ్లు సైతం పడ్డాయి. దాదాపు మూడుగంటల పాటు ఈ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈదురుగాలులకు కరెంట్ తీగలు తెగిపోయినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి.

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, రెడ్డిపల్లి, చందానగర్, అప్పోజీగూడ, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మొత్కుపల్లి తదితర గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. మామిడికాయలు నేలరాలాయి.

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్, బాకారం, ఎన్కెపల్లి, హిమాయత్‌నగర్, తోల్‌కట్ట, చిన్నమంగళారం, వీరన్నపేట్, ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి, సజ్జన్‌పల్లి, చాకలిగూడ, ముర్తుజాగూడ, కాశీంబౌలి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

షాద్‌నగర్‌లో వడగళ్ల వర్షం

షాద్‌నగర్: షాద్‌నగర్‌లో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. ఫరూఖ్‌నగర్ పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో పరిగి రోడ్డుపై చెట్టు విరిగి పడటంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం


కొందుర్గు: ప్రచారంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు

కొందుర్గు: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్, వెంకిర్యాల, గుర్రంపల్లి, ముష్టిపల్లి, జాకారం గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇవి దేశానికి సంబంధించిన ఎన్నికలు.. ఆలోచించి ఓటు వేయాలన్నారు. మోదీ ప్రధాని కావాలంటే కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షులు కుర్మయ్య, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే నిరుపేదలకు న్యాయం

షాద్‌నగర్‌రూరల్: నిరుపేదల అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద, కందివనం గ్రామాల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డికె.అరుణకు మద్దతుగా బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కందివనంలో ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి ప్రధాని మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే.అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆనంద్, బాబు, మహేశ్, ఉదయ్‌కుమార్, సురేశ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం


మాట్లాడుతున్న అంజయ్యయాదవ్

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో మంగళవారం నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఆ రెండు పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. ఏ గ్రామానికి వెళ్లినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలు మాట్లాడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టిందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పరిధిలోని చౌలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు ఫిరోజ్, సత్తయ్య తదితరులు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వంకాయల నారాయణ రెడ్డి, వెంకట్‌రెడ్డి, భీష్వ రామకృష్ణ, మన్నె నారాయణ, శంకర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హస్తం పార్టీకి గుణపాఠం తప్పదు


ప్రచారంలో పాల్గొన్న అనంతరెడ్డి, తదితరులు

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి అనంతరెడ్డి

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంపై అతి తక్కువ కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు బాకారం, ఎన్కెపల్లి, జీవన్‌గూడ, అజీజ్‌నగర్, ముర్తుజాగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గడిచిన పది సంవత్సరాలలో బీఆర్‌ఎస్ పార్టీతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని తెలిపారు. కేసీఆర్ హయాంలోనే నిరుపేదలకు న్యాయం జరిగిందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు జీవంతు, రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, సుధాకర్‌యాదవ్, నర్సింహ్మాగౌడ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌లు రాహుఫ్, డప్పు రాజు, దారెడ్డి వెంకట్‌రెడ్డి, పరమేశ్, కుమ్మరి రాము, రాంచందర్, ఎత్‌మార్‌పల్లి ప్రవీణ్‌రెడ్డి, ముర్తుజగూడలో రామగల్ల వీరయ్య, ఎండీ మతీన్, బాబుయాదవ్, వినోద్, మాణిక్యం, వెంకటేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లలో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టనున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, నియోజవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్‌లు అన్నారు. మండలంలోని ముడిమ్యాల, కుమ్మెర గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాములు, సత్యనారాయణచారి, నర్సింలు, శేరి శివారెడ్డి, రామగౌడ్, కృష్ణ, గని, పాండు యాదిరెడ్డి, చింటూ, మహేందర్, రాంప్రసాద్, రాజు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్: కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మా ట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతుందని విమర్శించారు. దీంతో పేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశ సంపద దోచుకునే వారికే బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పని దినాలు పెంచడమే కాకుండా కూలీ పెంచుతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బాబర్‌ఖాన్, రఘు, బొమ్ము అంజయ్య, శ్రీనివాస్ యాదవ్, నర్సింహ్మారెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో నిరుపేదలకు న్యాయం

కేశంపేట: కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ లోక్‌సభ ఎన్నికల మండల ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకుడు ఇబ్రహీం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నిరుపేదల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో అమలు అయిన పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందన్నారు. చేయి గుర్తుకు ఓటు వేసి చల్లా వంశీచంద్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అల్వాల ఎంపీటీసీ సురేశ్‌రెడ్డి, జంగయ్య, శ్రీశైలం, అమేర్, ముత్యాలు, ఖాజా, నందు, బాలు, రమేష్, రామకృష్ణ, రాజేందర్, షాబుద్దీన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మంగళవారం కొత్తూర్ మాజీ జెడ్పీటీసీ శ్యామ్ సుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రాజు, నరేశ్, అజీమ్, మహేశ్, శంకర్, నర్సింహ, శివారెడ్డి, సాయిలు, సల్మాన్, సమీర్ ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్డీఓ

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మంగళవారం ఆర్డీఓ వెంకట మాధవరావు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు.

మాధురికి డాక్టరేట్

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు ప్రజల్లో గుర్తింపు పొందే విధంగా ఉండాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య ఆర్.కిష్టఫర్ అన్నారు. చైతన్య యూనివర్సిటీ పందిరి మాధురికి ఆయన డాక్టరేట్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో 'సింథసిస్, క్యారెక్టరైజేషన్ ఆఫ్ నోవేల్ బెంజ్ ఇమిడాజోల్స్ అండ్ పినోక్సలిన్ మొయిటీస్ ఫేర్ బయోలజికల్ యాక్టివిటీ' అనే అంశంపై ప్రొఫెసర్ బి.శ్రీనివాస్ పర్యవేక్షణలో పందిరి మాధురి పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో ఆమెను గుర్తించి డాక్టరేట్ అందజేశారు.